# మహా సంరంభానికి అంకురార్పణ

- అంగరంగ వైభవంగా రజతోత్సవ మహాసభ పనులకు శ్రీకారం
- కదనోత్సాహంతో తరలివచ్చిన గులాబీ దళం
- మినీ సభను తలపించిన ప్రాంగణం
- ప్రత్యేక ఆకర్షణగా స్కై బెలూన్

హనుమకొండ సబర్బన్, ఏప్రిల్ 2 : బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకకు వేదికైన ఎల్కతుర్తిలో బుధవారం మహాసభ పనుల అంకురార్పణ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ నెల 27న రాష్ట్ర నలుమూలల నుంచి లక్షలాదిగా తరలిరానున్న నేపథ్యంలో ఈ సభా ప్రాంగణం వద్ద వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ మాజీ రాజ్యసభ సభ్యులు కెప్టెన్ లక్ష్మీకాంతారావు-సరోజినీ దంపతుల విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేసిన తర్వాత పనులకు శ్రీకారం చుట్టారు. లాంఛనంగా మట్టి తవ్వగా ఉదయమే అక్కడికి భారీగా చేరుకున్న గులాబీ దళం, కేసీఆర్ అభిమాన గణం ఉత్సాహంగా పనుల్లో నిమగ్నం కావడంతో ఆ ప్రాంతమంతా మినీ సభలా మారిపోయి పండుగ వాతావరణం తలపించింది. ఎల్కతుర్తిలో సభ నిర్వహించేందుకు గత పది రోజులుగా జిల్లా అధ్యక్షుడు వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, వొడితెల సతీశ్‌కుమార్‌లు పలు మార్లు పరిశీలించి అధినేత కేసీఆర్‌కు వివరాలు అందజేశారు. తర్వాత పార్టీ తరపున ప్రధాన కార్యదర్శి బాలమల్లు సైతం సందర్శించి ప్రతిష్టాత్మక సభను ఎల్కతుర్తిలో నిర్వహించేందుకు పచ్చ జెండా ఊపారు. ఈ క్రమంలో బుధవారం ప్రాంగణాన్ని చదును చేసే పనులకు మొదలయ్యాయి. దేశంలోనే భారీ సభగా నిర్వహిస్తామని చెబుతున్న నేపథ్యంలో ఎల్కతుర్తి బీఆర్ఎస్ సభపై పరిసర గ్రామాల్లో ఆసక్తి కనిపిస్తోంది. ఉదయం నుంచే మండలకేంద్రానికి పార్టీ కార్యకర్తలు, అభిమానులు చేరుకోగా సరిగ్గా ఒంటి గంట 10 నిమిషాలకు వేద పండితులు సూచించిన స్థలంలో పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. సభా ప్రాంగణం సమీపంలో ఏర్పాటు చేసిన స్కై బెలూన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

## ముఖ్య నేతలకు ఎర్రబెల్లి దిశానిర్దేశం

హనుమకొండ, ఏప్రిల్ 2 : బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభ ఏర్పాట్లపై వర్ధన్నపేట నియోజకవర్గంలోని హసన్‌పర్తి సహా 13 డివిజన్ల ముఖ్య నేతలతో నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బుధవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ మేరకు హనుమకొండ రాంనగర్‌లోని ఆయన నివాసంలో మహాసభ విజయవంతంపై వారికి దిశానిర్దేశం చేశారు. సమావేశంలో డివిజన్ల ముఖ్య నాయకులు, నియోజకవర్గ కోఆర్డినేటర్లు, మండల ఇన్‌చార్జీలు, మండల కోఆర్డినేటర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ ప్రతినిధులు, శ్రేణులు, సోషల్ మీడియా వారియర్స్, యువత పాల్గొన్నారు.





# రజతోత్సవ మహాసభ దద్దరిల్లాలె..

సభా ప్రాంగణంలో ఓ ఇంటిపై ఎగురవేసిన స్కై బెలూన్

### అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం

ఎల్కతుర్తిలో నిర్వహించబోయే రజతోత్సవ మహాసభకు వచ్చే ప్రజల కోసం సకల సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం. మూడు జాతీయ రహదారులకు కేంద్ర బిందువుగా ఉన్న ఎల్కతుర్తిని బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేసీఆర్ సభ కోసం ఎంపిక చేశారు. సభా ప్రాంగణం కాకుండా మూడు వైపులా పార్కింగ్ కోసం 1000 ఎకరాల స్థలాన్ని సేకరించాం. రహదారులు కూడా కొత్తగా వేయడంతో పాటు ప్రజలు సభా ప్రాంగణానికి సులువుగా నడుచుకుంటూ వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ఎండలు ఎక్కువగా ఉన్న దృష్ట్యా ప్రజలకు 10 లక్షల మజ్జిగ ప్యాకెట్లతో పాటు 10 లక్షల వాటర్ బాటిళ్లను అందుబాటులో ఉంచుతున్నాం. సభ విజయవంతం కోసం వివిధ కమిటీలు వేస్తున్నాం.

– పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

## సభను విజయవంతం చేయాలి

### పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

ఆత్మకూరు, ఏప్రిల్ 2 : ఈ నెల 27న ఎల్కతుర్తిలో జరిగే రజతోత్సవ సభకు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు, అభిమానులకు, ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండలోని ఆయన నివాసంలో నియోజకవర్గ స్థాయి, సమన్వయ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా మాట్లాడుతూ మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 15 నెలలైనా వాటిని అమలుచేయడం లేదన్నారు. అందుకే రేవంత్ సర్కారుపై ప్రజల్లో వచ్చిన వ్యతిరేకతకు భయపడే స్థానిక సంస్థ ఎన్నికలకు పోవడం లేదని ఆరోపించారు. గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు తిరిగిలేని పరిస్థితుల్లో ఉన్నారని స్థానిక ఎన్నికలు ఎప్పుడొచ్చినా కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు కొంతకాలం ఓపికతో, సమన్వయంతో ఉండాలన్నారు. ఎవరి బెదిరింపులకు భయపడాల్సిన అవసరం లేదన్నారు. పార్టీ బలోపేతం కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు పార్టీ ఉండగా ఉంటుందన్నారు. ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని చెప్పారు. రేపటి నుంచి ఆయా మండలాల సమన్వయ కమిటీ సభ్యులు గ్రామాల్లో వెళ్లి సమావేశాలు నిర్వహించాలన్నారు. ఏ గ్రామం నుంచి ఎంత మంది పార్టీ శ్రేణులు సభకు వస్తున్నారో, కావాల్సిన వాహనాలు, ఎన్నో జాబితా సిద్ధం చేసి ఇవ్వాలని కోరారు. సమావేశంలో పరకాల, పరకాల మున్సిపాలిటీ, ఆత్మకూరు, దామెర, నడికూడ, సంగెం, గీసుగొండ, గ్రేటర్ పరిధిలోని 15, 16, 17 డివిజన్లలోని సమన్వయకమిటీ సభ్యులు, మండల అధ్యక్షులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## లక్షలాదిగా తరలి రావాలి

- సభ విజయవంతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలి
- 15 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత
- బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం
- ఎల్కతుర్తిలో సభ ఏర్పాట్లకు అంకురార్పణ పూజ
- పాల్గొన్న మాజీ మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్సీలు పోచంపల్లి, తక్కళ్లపల్లి, ఎమ్మెల్యే పల్లా, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల, పెద్ది, చల్లా, నన్నపునేని, శంకర్‌నాయక్

ఎల్కతుర్తి, ఏప్రిల్ 2 : ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించబోయే బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు ప్రజలు లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో రజతోత్సవ మహాసభ ప్రాంగణంలో ఏర్పాట్లకు అంకురార్పణ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీశ్‌కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, బానోతు శంకర్‌నాయక్, నన్నపునేని నరేందర్, మాజీ చైర్మన్‌లు గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మారెపల్లి సుధీర్‌కుమార్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. గద్దెనెక్కిన 15 నెలల్లోనే ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్న ప్రభుత్వంగా కాంగ్రెస్ ఖ్యాతి గడించిందని విమర్శించారు. ఈ సభ నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై యుద్ధం ప్రకటించడం జరుగుతుందని వెల్లడించారు. చారిత్రాత్మకమైన ఈ మహాసభను ఇక్కడ నిర్వహించే అవకాశం కల్పించిన బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మహాసభ విజయవంతం కోసం కింది స్థాయి కార్యకర్త మొదలు నాయకులంతా కృషి చేయాలని కోరారు. యువ కార్యకర్తలు సైనికుల్లా పనిచేస్తేనే ఈ మహా క్రతువును విజయవంతం చేయడం సులువవుతుందన్నారు. సభ కోసం స్వచ్ఛందంగా భూములు ఇచ్చిన ఎల్కతుర్తి, చింతలపల్లి గ్రామ రైతులకు చేతులెత్తి నమస్కరిస్తున్నానని దాస్యం తెలిపారు.



సభా ప్రాంగణంలో భూమిపూజ చేస్తున్న ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ నేతలు



మాట్లాడుతున్న దాస్యం వినయ్‌భాస్కర్

బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పిట్టల మహేందర్, పోరెడ్డి రవీందర్‌రెడ్డి, ఎల్తూరి స్వామి, వెంకటేశ్‌యాదవ్, కడారి రాజు, మహిపాల్‌రెడ్డి, కోరె రాజుకుమార్, చిట్టిగౌడ్, వీరలింగం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### 25 ఏండ్ల చరిత్ర ఆవిష్కృతం



ఎల్కతుర్తిలో నిర్వహించబోయే బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభలో 25 ఏండ్ల పార్టీ చరిత్ర ఆవిష్కృతం కానుంది. దేశంలోనే అతిపెద్దదిగా ఎల్కతుర్తి సభ కీర్తి గడించబోతున్నది. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తే, ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అధోగతి వైపు సాగుతున్నది. ప్రస్తుత పాలకుల పుణ్యమా అని అటు సాగు, ఇటు తాగు నీళ్లకు ప్రజలు అల్లాడిపోతున్నారు. కేసీఆర్‌ను వదులుకొని తాము తప్పు చేశామని ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ వచ్చిన తర్వాతే హైదరాబాద్, వరంగల్‌తో పాటు గ్రామీణ ప్రాంతాలు బాగుపడ్డాయి. ఇప్పుడు చూద్దామన్నా అభివృద్ధి పనుల జాడ కనిపించడం లేదు. ఎన్నికలకు ముందు ఎన్నో హామీలిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్నీ మరిచిపోయింది. రజతోత్సవ సభకు లక్షలాదిగా జనం తరలివచ్చి ఈ ప్రభుత్వానికి హెచ్చరికను పంపాలి. దేశంలోనే ఏ రాష్ట్రంలో జరగని విధంగా ఈ మహాసభ జరగబోతున్నది. మరోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేసే దిశగా మనందరం కలిసిపోరాడాల్సిన అవసరం ఉంది. రజతోత్సవ సభ ఉమ్మడి వరంగల్ పరిధిలో జరగడం సంతోషించాల్సిన విషయం. సభ విజయవంతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలి. హనుమకొండ, ఎల్కతుర్తి పరిసర ప్రాంత ప్రజలు అత్యవసరమైతేనే రోడ్లపైకి రావాలి. ఇంత పెద్ద సభకు స్వచ్ఛందంగా భూములిచ్చిన రైతులకు కృతజ్ఞతలు.

– ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ మంత్రి

### సమష్టి కృషితో సక్సెస్ చేద్దాం..



ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులతో బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కేసీఆర్ సమావేశమై అనేక సూచనలు చేశారు. వారు ఇచ్చిన సూచనలను పాటించి సభ విజయవంతానికి అందరం సమష్టిగా కృషి చేద్దాం. గతంలో అనేక సభలను విజయవంతం చేసిన అనుభవం మనకుంది. అదే అనుభవంతో ఈ రజతోత్సవ మహాసభను సైతం కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహిద్దాం.

– తక్కళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్సీ

### అతిపెద్ద సభగా కీర్తికెక్కాలి



ప్రపంచంలో ఐదు అతి పెద్ద సభలు జరిగితే, అందులో ఒకటి గతంలో మనం వరంగల్‌లో నిర్వహించాం. ఇప్పుడు నిర్వహించబోయే బీఆర్ఎస్ రజతోత్సవ సభను ప్రపంచంలోనే అతిపెద్ద సభగా కీర్తికెక్కించాలి. పార్టీ తరపున మన నాయకుడు ఏ పిలుపునిచ్చినా దానిని క్రమశిక్షణతో అమలు చేసే చరిత్ర వరంగల్ జిల్లాకు ఉంది. అదే క్రమంలో ప్రస్తుత సభను కూడా విజయవంతం చేద్దాం. తెలంగాణ సాధనలో ఓరుగల్లు పాత్ర కీలకం. ప్రస్తుత సభ కోసం ప్రతి ఒక్కరూ కథానాయకులై కదలిరావాలి. తెలంగాణను తెర్లు చేస్తున్న దొంగల్ని తరిమికొట్టే రోజు వచ్చింది. ఈ సభకు ప్రజలు కూలీ పని చేసుకుంటూ స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు ఉత్సాహం చూపుతుండడం ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతకు నిదర్శనం.

– పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే

### అందరి సహకారం కావాలి



ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ నిర్వహించడం గర్వించదగ్గ పరిణామం. ఈ సభ కోసం ఇప్పటికే రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చారు. ఇదే క్రమంలో మిగతా విషయాల్లోనూ అన్ని వర్గాల ప్రజలు సహకరించాలి. సభా ప్రాంగణంతో పాటు పార్కింగ్ స్థలం కోసం కూడా మా భూములు వాడుకోండి అంటూ ఎన్‌వోసీలపై సంతకాలు చేసి ఇచ్చిన ఎల్కతుర్తి, చింతలపల్లి, ఇందిరానగర్, గోపాల్‌పూర్ రైతులకు కృతజ్ఞతలు. సభ పూర్తయ్యే వరకు కార్యకర్తలతో పాటు నాయకులు అప్రమత్తంగా ఉండి విజయవంతం చేయాలి.

– వొడితెల సతీశ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే

# రేణుకకు కన్నీటి వీడ్కోలు

- కడవెండిలో వేలాది మందితో మావోయిస్టు అగ్రనేత అంతిమ యాత్ర
- పెద్ద ఎత్తున హాజరైన ప్రజాసంఘాల నాయకులు
- నివాళులర్పించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి, జనగామ ఎమ్మెల్యే పల్లా



గుమ్మడవెల్లి రేణుక అంతిమ యాత్ర నిర్వహిస్తున్న ప్రజాసంఘాలు నాయకులు



కడవెండిలో రేణుక మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

దేవరుప్పుల, ఏప్రిల్ 2 : మావోయిస్టు అగ్రనేత, దండకారణ్య స్పెషల్‌జోన్ కమిటీ సభ్యురాలు, ప్రెస్ టీం ఇన్‌చార్జి గుమ్మడవెల్లి రేణుకకు బుధవారం ఆమె స్వగ్రామమైన జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండి కన్నీటి వీడ్కోలు పలికింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ జిల్లా బైరాంఘర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నెల్‌గోడా అఖేలి ప్రాంతంలో జరిగిన ఎదురు కాల్పుల్లో ఆమె మృతి చెందిన విషయం తెలిసిందే. ఛత్తీస్‌గఢ్ నుంచి రేణుక మృతదేహం మంగళవారం అర్ధరాత్రి స్వగ్రామానికి చేరుకోగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు. ప్రజల సందర్శనార్థం ఆమె మృతదేహాన్ని దొడ్డి కొమురయ్య స్థూపం వద్ద బుధవారం ఉంచగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు వేలాది మంది ప్రజాసంఘాల నాయకులు, సానుభూతిపరులు హాజరై నివాళులర్పించారు. అమరవీరుల బంధుమిత్రుల సంఘం అధ్యక్షురాలు అంజమ్మ, నాయకులు పద్మకుమారి, పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, నారాయణరావు, వీక్షణం సంపాదకులు వేణుగోపాల్‌రావు, శాంతక్క, విరసం నాయకులు కార్యదరి రివేరా, పాణి, జ్వాలాముఖి, శివరాత్రి సుధాకర్, రాము, వరంగల్ విరసం కన్వీనర్ కొడెం కుమార్, తెలంగాణ ఫ్రంట్ నాయకులు రవిచందర్, రమాదేవి, చైతన్య మహిళా సంఘం నాయకురాలు అనురాధ, కళ, మొగిలిచర్ల భారతక్క, గాజర్ల అశోక్ అలియస్ ఐతూ, గద్దర్ కుమారుడు సూర్యం, వెన్నెల, వరవరరావు కుమార్తెలు అనల, సహజ, పవన తదితరులు హాజరై రేణుక త్యాగాన్ని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వ దమన కాండను ఖండించడంతో పాటు ఆపరేషన్ కగార్‌ను ఆపాలని డిమాండ్ చేశారు. అనంతరం అరుణోదయ, ప్రజామండలి విప్లవ సంఘాల పాటలు, డప్పువాయిద్యాల నడుమ వేలాది మంది పాల్గొన్న అంతిమ యాత్ర నాలుగు గంటల పాటు కొనసాగి శ్మశానవాటికకు చేరుకుంది. అనంతరం ఆమె కుటుంబ సభ్యులు సామూహికంగా చితికి నిప్పంటించగా అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు ముగిశాయి.

# మంత్రి సురేఖ ఇంటి ముట్టడి


- హెచ్‌సీయూ విద్యార్థులపై లాఠీచార్జికి విద్యార్థి సంఘాల నిరసన
- అడ్డుకున్న పోలీసులు.. తోపులాట.. నిర్బంధించి స్టేషన్‌కు తరలింపు

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 2: హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులపై పోలీసులు జరిపిన లాఠీచార్జిని నిరసిస్తూ కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నాయకులు బుధవారం హనుమకొండ రాంనగర్‌లోని మంత్రి కొండా సురేఖ ఇంటిని ముట్టడించారు. పోలీసుల వలయాన్ని ఛేదించుకొని మంత్రి ఇంటి గేటు ముందు కూర్చొని రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరే కంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోలీసులకు, విద్యార్థి సంఘ నాయకులకు తీవ్ర వాగ్వాదం జరిగి తోపులాట జరిగింది. విద్యార్థులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి వ్యాన్లలో ఎక్కించి సుబేదారి పోలీస్‌స్టేషన్ తరలించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకు లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హెచ్‌సీయూ విద్యార్థుల పట్ల కర్కశంగా, అత్యంత పాశవి కంగా వ్యవహరిస్తూ అక్రమంగా లాఠీచార్జికి పాల్పడిందన్నారు. బాధ్యులైన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. హెచ్‌సీయూ భూములను కార్పొరేట్, పెట్టుబడిదా రులకు అప్పగించే చర్యలను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని, లేకుంటే ప్రభుత్వానికి పతనం తప్పదని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు బీ నర సింహారావు, మొగిలి వెంకట్‌రెడ్డి, మర్రి మహేశ్(పీడీఎస్‌యూ), భాషబోయిన సంతోష్ (ఏఐఎస్ఎఫ్), కే శ్రావణ్ (డీఎస్‌ఏ), మాలోత్ రాజేశ్ (యూఎస్ఎఫ్ఐ), మంద నరేశ్ (ఏబీఎస్ఎఫ్), ఎల్తూరి సాయికుమార్(ఎస్ఎస్‌యూ), కుమ్మరి శ్రీనాథ్ (ఎంఎస్ ఎఫ్), శివ నాస్తిక్ (బీఎస్ఎఫ్) తదితరులు పాల్గొన్నారు.






మంత్రి సురేఖ ఇంటి ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థి నాయకులు, (ఇన్‌సెట్‌లో) విద్యార్థులను అరెస్టు చేసి, స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు



# మన మిర్చి సూపర్

- వరంగల్ చపాటా మిర్చికి అంతర్జాతీయ గుర్తింపు
- ముందుచూపుతో చేసిన కృషితో జీఐ ట్యాగ్ సర్టిఫికెట్
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

మహబూబాబాద్ రూరల్/నల్లబెల్లి, ఏప్రిల్ 2 : వరంగల్ చపాటా మిర్చికి భౌగోళిక గుర్తింపు లభించింది. ప్రపంచ స్థాయిలో జియోగ్రాఫికల్ ఇండికేషన్(జీఐ) ట్యాగ్‌ను సాధించింది. ఈ మిర్చి మంచి ఆకర్షణగా ఉండి కారం తక్కువగా ఉండి, లావుగా ఉంటుంద ని, దీనిని ప్రధానంగా కాస్మోటిక్స్ వాటిలో ఎక్కువ వాడుతారు. ఇది క్వింటాకు రూ. లక్షకు పైగా రేటు ఉంటుంది. ఎకరాకు కేవలం ఆరు నుంచి ఏడు క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వస్తుంది. మల్యాల జేవీఆర్ పరిశోధనా స్థానం, హార్టికల్చర్ యూనివర్సిటీ కలిసి చపాటా మిర్చి పంటపై అనేక పరిశోధనలు చేసి రైతులకు లాభాలు వచ్చేలా రిసెర్చ్ చేసి పంపించామని, దాని ఫలితంగా చపాటా మిర్చికి అంతర్జాతీయ గుర్తింపు లభించిందని మల్యాల (జేవీఆర్) శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన కళాశాల పరిశోధనా స్థానం శాస్త్రవేత్త కత్తుల నాగరాజు పేర్కొన్నారు. భవిష్యత్తులో చపాటా మిర్చికి మంచి ధర పలకడమే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ చేసుకునే సౌకర్యం లభిస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చపాటా మిర్చిపై నిరంతరం పరిశోధనలు, కృషి చేసిన వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేశారు. కాగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో తాను నర్సంపేట ఎమ్మెల్యేగా ముందు చూపుతో చేసిన కృషికి గొప్ప ఫలితం రావడం ఆనందంగా ఉందని పెద్ది సుదర్శ న్‌రెడ్డి పేర్కొ న్నారు. మన ప్రాంతానికి అంతర్జాతీయ గుర్తింపు, జియోగ్రాఫికల్ ఇండికేషన్ ట్యాగ్ పొందడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా చపాట మిర్చి రైతులకు శుభాకాంక్షలు తెలిపారు. కాగా ఉమ్మడి వరంగల్‌లో ఒక పంటకు అంతర్జాతీయ గుర్తింపు దక్కడం ఇదే తొలిసారి.